పెరియార్- సమకాలీనత సదస్సు కరపత్రాల ఆవిష్కరణ

తెనాలి: మతాలు, కులాలుగా ప్రజలు విడిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పెరియార్ ఆలోచనలు సమాజానికి చాలా అవసరమని పెరియార్-అంబేడ్కర్-పూలే-జాషువా ఫౌండేషన్ చైర్మన్ బత్తుల విల్సన్ పేర్కొన్నారు. పెరియార్ ఆలోచనలు, సిద్ధాంతాలను నేటి తరానికి పరిచయం చేయాలనే ఉద్దేశంతో పెరియార్-సమకాలీనత సదస్సులను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 16న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు జరిగే సదస్సును జయప్రదం చేయాలని కోరారు. సదస్సుకు జన సమీకరణ పర్యటనలో భాగంగా శనివారం తెనాలి వచ్చిన ఆయన, స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రం ఆవరణలో సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. లౌకికవాదం ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న నేటికాలంలో కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ఉపాధ్యక్షుడు ఆరాధ్యుల కన్నా, పిట్టు కోటేశ్వరరావు, కె.రవికుమార్, దేవరపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న విల్సన్ తదితరులు

రేపు కౌలు రైతుల పాదయాత్ర

తాడేపల్లిరూరల్: ప్రకాశం బ్యారేజ్ నుంచి మంగళగిరి సీసీఎల్ కార్యాలయం వరకు జూన్ 12న జరుగనున్న కౌలు రైతుల పాదయాత్రను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు పిలుపునిచ్చారు. ఎంటీఎంసీ పరిధిలోని నిడమర్రులో శనివారం కరపత్రాల్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలుదారులకు భూయజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆరుకాలం కష్టపడే కౌలు రైతులకు ప్రభుత్వం కల్పించే సదుపాయాలు అందడం లేదని తెలిపారు. అకాల వర్షాలు వచ్చి పంట మొత్తం దెబ్బతిని, రుణ సదుపాయం లేక, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని ప్రభుత్వ సదుపాయాల్ని కౌలుదారులకు అందించాలని డిమాండ్ చేస్తూ జూన్ 12వ తేదీ ప్రకాశం బ్యారేజ్ నుంచి మంగళగిరి సీసీఎల్ కార్యాలయం వరకు జరిగే పాదయాత్రలో కౌలు, పేద రైతులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గైరబోయిన నాగేశ్వరరావు, సీఐటీయూ జిల్లా నేత ఎం. రవి పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కోనేరులో బయటపడ్డ రాతి కట్టడాల నమూనాలు

తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి పుష్కరిణి పనులు శరవేగంగా సాగుతున్నాయి. శనివారం పనులు నిర్వహిస్తుండగా మెట్ల భాగంలో రాతి కట్టడాల నమూనాలు బయటపడ్డాయి. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి వాటిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కోనేరు పూడికతీత 90 శాతం పూర్తయిందని తెలిపారు. మెట్ల భాగంలో రెండు చోట్ల రాతి నమూనాలు శివలింగం ఆకారంలో ఉన్నాయని చెప్పారు. పనులు పూర్తయ్యేసరికి మరో నెల రోజులు పడుతుందని పేర్కొన్నారు. కోనేరు లోపలి భాగంలో బావి ఉన్నట్లు ఇప్పటికే కనుగొన్నామని, అందులో సైతం గట్టి నేల తగిలే వరకు పూడికతీత నిర్వహిస్తామని చెప్పారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా

తాడేపల్లిరూరల్: తాడేపల్లి నులకపేటలోని పంపింగ్ స్కీమ్ నుంచి డోలాస్‌నగర్, నులకపేట ప్రాంతాలకు సరఫరా అయ్యే తాగునీటి పైపులైన్ పగిలిపోవడంతో శనివారం పలు ప్రాంతాలకు కార్పొరేషన్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేశారు. నవులూరు నుంచి ఐవోసీ కంపెనీ వరకు గ్యాస్ పైప్‌లైన్ వేస్తున్నారు. దీని నిర్మాణం కోసం రోడ్డు వెంబడి గోతులు తీయడంతో పలుచోట్ల తాగునీటి పైపులైన్లు పగిలిపోయాయి. విషయం తెలుసుకున్న కార్పొరేషన్ అధికారులు డోలాస్‌నగర్, ప్రకాష్‌నగర్, నులకపేటలో కొన్ని ప్రాంతాలకు తాగునీటిని అందజేశారు. సాయంత్రానికి పైపులైన్లకు మరమ్మతులు నిర్వహించి సరఫరాను పునరుద్ధరించారు.

రెండు ఇళ్లలో చోరీ

మేడికొండూరు: మండలంలోని జంగంగుంట్లపాలెంలో రెండు ఇళ్లల్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన శనివారం వెలుగు చూసింది. జంగంగుంట్లపాలేనికి చెందిన కొల్లి శివారెడ్డి, కొల్లి వెంకటకృష్ణారెడ్డి సోదరులు. కుటుంబ సభ్యులతో కలసి వారం రోజుల కిందట షిర్డీ వెళ్లారు. యాత్ర ముగించుకుని శనివారం గ్రామానికి చేరుకున్నారు. తలుపులు తీసి లోపలకు వెళ్లి చూస్తే రెండు ఇళ్లల్లో వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బీరువా తాళాలు పగులగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు భావించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రెండు ఇళ్లల్లో రూ. 40వేలు, రూ. 5 లక్షల విలువ చేసే బంగారం, కేజీ వెండి, పట్టు చీరలు చోరీకి గురైనట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

15 నుంచి యోగా వారోత్సవాలు

కొరిటెపాడు(గుంటూరు): బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకు 'యోగా వారోత్సవాలు' నిర్వహించనున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణ చెప్పారు. పట్టాభిపురంలోని బజరంగ్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. క్రమం తప్పకుండా అభ్యాసం ఉంటే ఏ రంగంలోనైనా రాణించడం, ప్రావీణ్యం సంపాదించడం సాధ్యపడుతోందని తెలిపారు. శారీరక ఆరోగ్యానికి ఎంతో మేలు చేయడంతో పాటు మానసిక వికాసానికి, ఒత్తిడిని జయించేందుకు యోగా దోహదపడుతుందన్నారు. భారతీయ సంప్రదాయ ఆరోగ్య పరిరక్షణ సూత్రాల్ని గౌరవిస్తూ, నిత్యం యోగ సాధన చేస్తూ, స్ఫూర్తిదాయకమైన జీవన విధానాన్ని అవలంబిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నేటి యువతరం ఆదర్శవంతమైన జీవన విధానాన్ని అనుసరించాలని ఆయన సూచించారు. అద్భుతమైన పాలన రీతుల్లో ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో సంతృప్త స్థాయిల్ని సాధిస్తున్న సీఎం జగనన్న మార్గదర్శకత్వంలో ప్రజల జీవన ప్రమాణ స్థాయిల్లో అత్యుత్తమ స్థాయిని సాధించాలన్న ఆకాంక్షతో బజరంగ్ ఫౌండేషన్ యోగా వారోత్సవాల్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 15న ఆచార్య పతంజలి గురు పూజ, 16న ఆచార్య తిరుమలై కృష్ణమాచార్య, 17న ఆచార్య కృష్ణ పట్టాభి, 18న ఆచార్య కె.ఎస్.అయ్యంగార్, 19న ఆచార్య వి.నానమ్మాల్, 20న ఆచార్య శివానంద, 21న ఆచార్య సద్గురు జగ్గీ వాసుదేవ్ గురు పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతి రోజు ఉదయం 5.30 గంటలకు యోగా శిక్షణ, 7 గంటల నుంచి 8 గంటల వరకు ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అనంతరం యోగా అమృతాహారం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమాలకు వేదికగా పట్టాభిపురంలోని బజరంగ్ క్యాంపస్ ఉంటుందని ఆయన వెల్లడించారు. రిజిస్ట్రేషన్ కోసం 9154428858, 9063063943 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరీ

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ప్రధాన కార్యదర్శి ఎం.వై.శేషురాణి ఆధ్వర్యంలో శనివారం విద్వాన్ అయ్యగారి సత్యప్రసాద్ శాస్త్రీయ సంగీత కచేరీ అలరించింది. డాక్టర్ ఎం. సుమిత్ర, డాక్టర్ ఎం. శ్రీధర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. శ్రీ త్యాగరాజస్వామి కృతులు, అనేక వాగ్గేయకార కీర్తనలను కీబోర్డుపై సత్యప్రసాద్ శ్రావ్యంగా పలికించి ప్రేక్షకుల్ని అలరించారు. ఆయనకు వీణపై విదుషి అయ్యగారి రాజ్యలక్ష్మి, మృదంగంపై కె.యోగేష్, ఘటంపై బుద్ధవరపు మారుతీ రఘురామ్ వాయిద్య సహకారాన్ని అందించారు. ముఖ్య అతిథిగా హిందూ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.వి.దుర్గాప్రసాద్ పాల్గొని కళాకారుల్ని సత్కరించారు. కార్యక్రమాన్ని సంస్థ ఉపాధ్యక్షురాలు మాధవపెద్ది మీనాక్షి, పాటిబండ్ల లలిత, డాక్టర్ రాజరాజేశ్వరి, కోశాధికారి విజయలక్ష్మి, కార్యదర్శి మంగాదేవి పర్యవేక్షించారు.

విలువలతో కూడిన విద్యనందించాలి

ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు


మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి

రేపల్లె రూరల్: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. చాట్రగడ్డ గ్రామంలోని ఎస్‌వీఎస్‌వీ స్కూలు బాధ్యతలు ఇటీవల విజయవాడకు చెందిన శ్రీ సరస్వతీ విద్యామందిర్ స్వీకరించింది. శనివారం పాఠశాల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడారు. సరస్వతీ విద్యామందిర్ తీర ప్రాంతమైన రేపల్లె మండలంలో పాఠశాలను నిర్వహణ బాధ్యతలు తీసుకోవటం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులకు ఎటువంటి మానసిక ఒత్తిడి కలగకుండా నాణ్యతతో కూడిన విద్యను అందించాలని కోరారు. కార్యక్రమంలో బాపుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, అధ్యక్షుడు కొత్తపల్లి రమేష్ కృష్ణ చంద్ర, ఉపాధ్యక్షుడు నారాయణరావు, కార్యదర్శి కన్నెగంటి రామరాయ చౌదరి, సహ కార్యదర్శి దుగ్గిరాల అశోక్ కుమార్, కోశాధికారి వెంకటప్పయ్య, సభ్యులు రాజగోపాల్, నార్ల సాయన్న పాల్గొన్నారు.

రసవత్తరంగా వైఎస్సార్ స్మారక క్రికెట్ టోర్నీ

కొల్లూరు: వైఎస్సార్ స్మారక క్రికెట్ టోర్నీ రసవత్తరంగా సాగుతోంది. కొల్లూరు బాలురు, బాలికల ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో పలు జట్లు శనివారం తలపడ్డాయి. బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ యూత్ విభాగం అధ్యక్షుడు మేరుగ చందన్‌నాగ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ టోర్నీ మూడో రౌండ్ లోకి ప్రవేశించింది. కొల్లూరు పోనెక్స్ జట్టుపై తలపడిన పోతార్లంక జట్టు విజయం సాధించగా, అబ్బన గూడవల్లి జట్టుపై దుండిపాలేనికి చెందిన జై దుర్గా భవానీ జట్టు గెలుపొందింది.

అర్హతే ప్రామాణికంగా గృహ యోగం


నవులూరులో లే అవుట్‌లో టీడీపీ మాజీ కౌన్సిలర్‌కు ఇంటి స్థలం పట్టాను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

- రాజకీయ నాయకుల ప్రమేయం ఉండదు
- ఎంటీఎంసీ వ్యాప్తంగా 30 వేల మందికి ఇళ్ల పట్టాలు
- ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లి రూరల్ : వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తరువాత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా పేద ప్రజలకు సంక్షేమ పథకాల్ని అందిస్తున్నారని మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తెలిపారు. తాడేపల్లి ప్రాంతంలోని పోలకంపాడు, ముగ్గు రోడ్డు, సలాం హోటల్ సెంటర్, రన్నింగ్ రూమ్, 1వ వార్డు ప్రాంతాల్లో అక్కాచెల్లెమ్మలకు శనివారం ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవితో కలసి నవులూరులో ఇళ్లపట్టాల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ గతంలో పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే కమిటీలు అంటూ రాజకీయ నాయకుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా న్యాయం జరిగేది కాదని తెలిపారు. ఎంతోమంది అక్కాచెల్లెమ్మలు గతంలో ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నా నిరాశ ఎదురైందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత అర్హతనే ప్రామాణికంగా తీసుకుని, రాజకీయాలతో సంబంధం లేకుండా ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. టీడీపీకి చెందిన మాజీ కౌన్సిలర్ నీలిమా దేవికి సైతం జగనన్న ప్రభుత్వంలో ఇళ్ల స్థలం కేటాయించిన వైనం ఇందుకు ఉదాహరణగా నిలుస్తుందని వెల్లడించారు. గతంలో రైల్వే స్థలాల్లో ఇళ్లు తొలగించిన వారికి కూడా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పట్టాలు అందజేశామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా పండు, వైఎస్సార్ సీపీ వివిధ ప్రజా సంఘాల నాయకులు ముదిగొండ ప్రకాష్, మహేష్, జిలాని, రహమాన్, రహీమ్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలపై రాజకీయం చేయవద్దు


నవులూరు లే అవుట్‌లో ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లి రూరల్ : పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాలపై రాజకీయాలు మానుకుని వారికి చేతనైతే సహాయం చేయాలేగానీ, వారిని మాత్రం భయభ్రాంతులకు గురి చేయవద్దని మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. ఉండవల్లి, తాడేపల్లి ప్రాంతాల్లోని లబ్ధిదారులకు శనివారం ఉదయం నవులూరు లే అవుట్‌లో ఇళ్ల స్థలాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ పేద ప్రజలకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కేటాయిస్తున్న సెంటు ఇళ్ల స్థలంపై కొన్ని రాజకీయ పార్టీలు అనవసరంగా విమర్శలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. కనీసం నివాసం ఉండడానికి వీల్లేని గదుల్లోనే నలుగురైదుగురు జీవిస్తున్నారని, ఆ కుటుంబాల్ని ఒక్కసారి పలకరిస్తే సెంటు భూమి విలువ తెలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మేడల్లో నివాసముంటూ పేదల స్థలాలపై మాట్లాడడం సరికాదని హితవు పలికారు. ఒక పక్క ప్రజలు సంతోషంగా ఇళ్ల పట్టాలు అందుకుంటూ ఆనందంగా ఉంటే.. మరో పక్క పనీపాటా లేని కొంతమంది స్వార్థపరులు లేఅవుట్లపై అనవసర విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, యువజన నాయకులు మహేష్ పాల్గొన్నారు.

భయం భయంగా బతుకు



40 సంవత్సరాల నుంచి రైల్వే స్థలాల్లో భయం భయంగానే బతుకుతున్నాం. ఎన్నోసార్లు అధికారులు ఇళ్లు పీకేందుకు వచ్చారు. గత సంవత్సరం భారీ బందోబస్తుతో వస్తే ఎమ్మెల్యే ఆర్కే అడ్డుకున్నారు. మాకు స్థలం ఇచ్చిన తరువాతే ఇళ్లు తొలగిస్తారని హామీ ఇచ్చారు. నేడు మా ఆందోళన జగనన్న రూపంలో మాయమైంది. మా పిల్లలందరికీ ఇళ్ల ప్లాట్లు ఇచ్చారు.

– ఏటుక మరియమ్మ, తాడేపల్లి ముగ్గు రోడ్డు

అద్దెలతో సతమతం



కూలీ నాలీ చేసుకునే మేము తాడేపల్లిలో ఇళ్ల స్థలం కొనలేక 20 సంవత్సరాల నుంచి అద్దెలు కట్టుకుంటూ జీవిస్తున్నాం. ఎన్నోసార్లు ఇళ్ల స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నాం. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అంటూ రాజధానిలో మాకు కేటాయించారు. ఎలాగోలా ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయంతో ఇంటిని కూడా నిర్మించుకుంటాం.

– కనకలత, సలాం హోటల్ సెంటర్

సొంతింటి కల నెరవేరింది



జగనన్నతోనే మా సొంతింటి కల నెరవేరింది. పెళ్లయిన దగ్గర నుంచి మేము అద్దె ఇంట్లోనే నివాసముంటున్నాం. మా పిల్లలకు పెళ్లయినా కూడా అద్దె ఇంట్లోనే ఉంటున్నారు. నేడు అర్హులైన మా పిల్లలతో పాటు మాకు కూడా ఇళ్ల స్థలం వచ్చింది. త్వరలోనే ఇంటిని నిర్మించుకుని నివాసముంటాం. జగనన్నకు పేద ప్రజలు ఎంతో రుణపడి ఉంటారు.

– ఎస్‌కే సనాబి, సలాం హోటల్ సెంటర్

వైభవంగా వాసవీ మాత ఆలయ వార్షికోత్సవం



ఫిరంగిపురం: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయ ఐదో వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు రాజేంద్రశర్మ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, నూతన వస్త్రాలతో అలంకరించారు. వాసవీ మాత అష్టోత్తర, సహస్ర నామ పూజలు , యాగశాలలో హోమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాల్ని ఆలయ చైర్మన్ డి.నరేంద్రకుమార్, జి.మధుసూదనరావు, కె. వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

వడ్డేశ్వరంలో మోటారు ఏర్పాటు



తాడేపల్లి రూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరంలో తాగునీటి కోసం వినియోగించే విద్యుత్ మోటార్లు ఇటీవల మరమ్మతులకు గురయ్యాయి. దీంతో అధికారులు రూ. 50 వేలతో 7.5 హెచ్‌పీ విద్యుత్ మోటార్‌ను కొనుగోలు చేసి శనివారం బోరుకు బిగించారు. దీనిద్వారా ఎంహెచ్ నగర్, ఇందిరానగర్ వాసులకు తాగునీరు సరఫరా చేయనున్నామని ఇంజినీరింగ్ అసిస్టెంట్ సతీష్ తెలిపారు.

మహిళ అదృశ్యం

గుంటూరు ఈస్ట్: మహిళ అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారంలో నివాసం ఉండే ఓ కుటుంబానికి చెందిన 21 సంవత్సరాల మహిళ శుక్రవారం ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికిన కుటుంబ సభ్యులు, కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువకుడి అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. భారత్‌పేట 8వ లైనులో నివాసం ఉండే ధనలక్ష్మి కుమారుడు 19 సంవత్సరాల సాత్విక్ శుక్రవారం ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికి కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జగనన్న కాలనీల్లో సకల సౌకర్యాలు




ఫిరంగిపురం: మండలంలోని యర్రగుంట్లపాడు పంచాయతీ లేఅవుట్‌లో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి యుగంధర్ కుమార్ మాట్లాడుతూ లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని చెప్పారు. ప్రభుత్వం అన్ని సదుపాయాల్ని జగనన్న కాలనీల్లో కల్పిస్తోందని తెలిపారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ పద్మనాభుడు, ఈసీ ప్రభాకర్, హౌసింగ్ ఇంచార్జి ఏఈ శ్రీనివాసరావు, గ్రామ సచివాలయ కన్వీనర్ శనగల నాగిరెడ్డి, పలు శాఖల అధికారులు, లబ్ధిదారులు ఉన్నారు.

దాసుల కాలనీలో సమస్యలు పరిష్కరించాలి



ఫిరంగిపురం: మండలంలోని బేతపూడి గ్రామంలోని గుండాలపాడు అగ్రహారం దాసుల కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్‌కు శనివారం కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో తాగునీరు లేక నానా ఇబ్బందులు పడుతున్నామని, సీసీ రోడ్డు సరిగా లేదని, విద్యుత్ స్తంభాలు లేవని తెలిపారు. శ్మశాన వాటికలో సరిగా స్థలంలేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. స్పందించిన సురేష్‌కుమార్ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట జి. మస్తాన్‌వలి, ఖాజావలి, షేక్ ఖాసింషహీద్ ఉన్నారు.

ప్రమాదకరంగా సంపులు



ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామానికి వెళ్లే దారిలో నీటి సరఫరా కోసం వేసిన సంపులపై మూతలు లేకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. ఇటీవల తారు రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ మట్టి పోయడంతో సంపులు పూర్తిగా రోడ్డుకు సమానంగా ఉన్నాయి. కానీ వీటిపై మూతలు లేకపోవడంతో రాత్రి సమయాల్లో కనిపించకపోవడంతో వాహనదారులు ఆ వైపుగా వస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో నీటి కోసం వచ్చిన మూగజీవాలు కొన్ని సంపులో పడిన సందర్భాలు లేకపోలేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూతలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.













షుగర్ చికిత్సపై పరిశోధనలో నాదెండ్లకు డాక్టరేట్



పేటెంట్ పొందిన ప్రొఫెసర్ రామారావును అభినందిస్తున్న చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ అంజనేయులు

గుంటూరు రూరల్: సిటాగ్లిప్టిన్, సిమ్వాస్టాటిన్ కలయికను టైప్- 2 మధుమేహ వ్యాధి చికిత్సకు ఉపయోగించే విధానంపై చేసిన పరిశోధనకు తనకు భారత ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం పేటెంట్‌ను మంజూరు చేసిందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. శనివారం నగర శివారుల్లోని లాంలోని కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నావెల్ యూవీ స్పెక్ట్రోస్కోఫిక్ అప్రోచ్ ఫర్ క్యాంటిఫికేషన్ ఆఫ్ సిమ్వాస్టాటిన్ అండ్ సిటాగ్లిప్టిన్ ఇన్ బల్క్ అండ్ ఫార్మాస్యూటికల్ ఫార్మాలేషన్ అనే అంశంపై నిర్వహించిన పరిశోధనకు ఈ పేటెంట్‌ను తనకు ఇవ్వటం జరిగిందన్నారు. ఈ పేటెంట్ 20 సంవత్సరాల వ్యవధి కలిగి ఉంటుందన్నారు. రక్తంలోని అధిక కొవ్వుల స్థాయినుంచి చికిత్స చేయటానికి ఇది సరైన ఆహారంతో పాటు ఉపయోగించటం జరుగుతుందని చెప్పారు. ఈ ఔషధ గుండె పోటు, స్ట్రోక్ వంటి రక్తనాళాలు మూసుకుపోవటం వచ్చే సమస్యలను నివారించటంలో సహాయపడుతుందని తెలిపారు. ప్రస్తుతం ఇటువంటి చికిత్సలు అధిక ఖర్చుతో కూడుకుని ఉన్నాయని ఈ పరిశోధన ఫలితంగా తక్కువ ఖర్చుతో చికిత్సను చేయవచ్చని తెలిపారు. ఈ కలయికలో ఉన్న ఔషధంపై 4 ఆవిష్కరణలు పరిశోధనలు జరిపినా ఈ పరిశోధన వైవిధ్య భరితంగా సరళతరంగా ఉడటం వల్ల పేటెంట్ ఆమోదం పొందిందన్నారు. చలపతి ఫార్మసీ కళాశాల ఇప్పటికే 37 పేటెంట్స్ పబ్లిష్ అవ్వగా మూడు పేటెంట్స్ ఆమోదించి మంజూరు చేయటం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పేటెంట్ పొందిన ప్రిన్సిపాల్‌ను చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ అంజనేయులు, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

అర్జీదారునిపై ఈవోపీఆర్డీ రుసరుసలు

లోకాయుక్తకు ఫిర్యాదు చేసిన కేసు విషయంలో వాగ్వాదం

ప్రత్తిపాడు: ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలని పోరాడుతున్న ఓ అర్జీదారుడిపై ఈఓపీఆర్డీ తన అధికార దర్పాన్ని ప్రదర్శించారు. నా బ్యాక్‌గ్రౌండ్ ఏమిటో నీకు తెలియదంటూ రెచ్చిపోయిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు... ప్రత్తిపాడు మండలం యనమదల పంచాయతీ పరిధిలో 850 సర్వే నంబరులో సుమారు 25 సెంట్లలో కోనేరు ఉంది. ఆ కోనేరు ఆక్రమణకు గురయిందని, పూర్వం ఆ కోనేరులో పడి ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని, ఆక్రమణల చెర నుంచి కోనేరు స్థలాన్ని విడిపించి అభివృద్ధి చేయాలంటూ అదే గ్రామానికి చెందిన జింకా బాజిబాబు 2021లో రాష్ట్ర లోకాయుక్తకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. స్పందించిన లోకాయుక్త విచారించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. కలెక్టర్ ఆదేశాల మేరకు అప్పటి తహసీల్దార్ ఆధ్వర్యంలో సర్వేయర్లు కోనేరుకు సర్వే జరిపారు. కోనేరు స్థలం ఆక్రమణకు గురయిందని నిర్ధారించారు. ప్రభుత్వ స్థలం ఖాళీ చేయాలని ఆక్రమితదారులకు గ్రామ పంచాయతీ నుంచి నోటీసులు పంపింది. అయినప్పటికీ ఇప్పటి వరకు పంచాయతీ అధికారులు ఆక్రమణలు తొలగించలేదు. తొమ్మిది నెలలుగా ఇదిగోదిగో అంటూ కాలం నెట్టుకుంటూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అర్జీదారుడు బాజిబాబు ఈఓపీఆర్డీ మావులూరి మోషెకు ఫోన్ చేశాడు. ప్రభుత్వ భూమి ఆక్రమణల చెర తొలగించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారంటూ గట్టిగా ప్రశ్నించాడు. దీంతో ఇరువురి మధ్య మాటామాటా పెరిగింది. అధికారిని హింసిస్తున్నావంటూ కేసు పెడతానని, నా బ్యాక్‌గ్రౌండ్ నీకు తెలియదని ఈఓపీఆర్డీ హెచ్చరించారు.

ఇదే విషయాన్ని అర్జీదారుడు శనివారం మీడియా ప్రతినిధులకు వివరించారు. వాస్తవానికి ఇప్పుడు కూడా ఈ విషయమై మాట్లాడేవాడిని కాదని, కానీ కోనేరు అభివృద్ధికి ఎంపీ ల్యాడ్స్ నుంచి తొమ్మిది లక్షలు నిధులు మంజూరయ్యాయని, ఆక్రమణలు తొలగిస్తే పనులు మొదలు పెట్టి కోనేరును అభివృద్ధి చేయవచ్చన్న ఉద్దేశంతో పదేపదే అధికారుల చుట్టూ తిరుగుతున్నాని వాపోయాడు. ఈవోపీఆర్డీ ఇలా బెదిరింపులకు పాల్పడటంపై మరోసారి లోకాయుక్తను జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తానని తెలిపారు. దీనిపై ఈవోపీఆర్డీ మావులూరి మోషెని 'సాక్షి' వివరణ కోరగా అసలు కోనేరు ఆక్రమణకు గురైన విషయం గానీ అభివృద్ధికి నిధులు మంజూరైన విషయం గానీ తనకు తెలియదన్నారు. నిధుల మంజూరు విషయమై ఎలాంటి రాత పూర్వక ఉత్తర్వులూ తమకు అందలేదన్నారు. అందుచేత రాత్రిళ్లు కూడా ఫోన్ చేసి విసిగిస్తుండటంతో కేసు పెడతానని చెప్పానని చెప్పారు.

శ్మశాన వాటికలో గుర్తు తెలియని మృతదేహం

చేబ్రోలు: స్థానిక శ్మశానవాటికలో గుర్తు తెలియని మృతదేహాన్ని శనివారం పోలీసులు గుర్తించారు. ఎంపీడీఓ కార్యాలయం వెనుక ఉన్న శ్మశానవాటికలో సుమారు నాలుగు రోజుల క్రితం మరణించిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహ ఉన్నట్లు పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. సుమారు 50 వయసు కలిగిన వ్యక్తి క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహం సమీపంలో పురుగు మందు డబ్బా, వాటర్ బాటిల్ సిగిరెట్ ప్యాకెట్లు, గళ్ల చొక్కా ఉంది. వ్యక్తి ఆచూకి కోసం దర్యాప్తు గాలింపు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పెదనందిపాడు: ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని జరుగులవారిపాలెంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వి.పూర్ణ చంద్రరావు(65) పాలు తీసుకొచ్చేందుకు రోడ్డుపై వచ్చాడని పొన్నూరు నుంచి చిలకలూరిపేట వైపు వెళుతున్న ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో తలకు బలమైన గాయం అయ్యిందని, క్షతగాత్రుడిని 108లో నరసరావుపేట ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పుసులూరులో వ్యక్తి..

పుసులూరులో వ్యక్తి మృతి చెందిన ఘటనపై స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన షేక్ ఇసాముద్దీన్(42) చిల్లర దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తుండేవాడని, ఆరోగ్య సమస్యలతో బాధ పడుతుండేవాడని, భార్య పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిన సమయంలో శుక్రవారం రాత్రి ఎలుకల మందు తిన్నాడని, ఇది గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెంది ఉన్నాడని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.







